kalamdaily.com

# కలం

ప్రజల గళం...

Follow on: Kalamtelugu

సోమవారం ● 30-03-2026

పేజీలు: 2

SINGLE TOPIC

# కాంట్రవర్సీ కౌశిక్



నిత్యం వివాదాల్లో హుజూరాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే

పాపులర్ లీడర్ కావాలన్న ఆరాటంతోనే చేస్తున్నారా?

పార్టీలో స్పెషల్ ఇమేజ్ కోసం తహతహలాడుతున్నారా?

ఓవైపు సూసైడ్ బెదిరింపులు.. మరోవైపు మర్డర్ సైగలు

గతంలో మహిళా గవర్నర్‌పై అసభ్యకరమైన వ్యాఖ్యలు

స్పందించని బీఆర్ఎస్ అధిష్టానం.. వెనకేసుకొస్తున్న కేటీఆర్ !

హుజూరాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కాంట్రవర్సీలకు కేరాఫ్ అడ్రస్ అయ్యారు. ఇంతకాలం మాటలతో ఆయన వివాదాస్పదులయ్యారు. ఇప్పుడు చేష్టలతోనూ సరికొత్త వివాదంలో చిక్కుకున్నారు. నోరుజారడం, ఆ తర్వాత క్షమాపణలు చెప్పడం ఆయనకు రొటీన్ ప్రాక్టీస్‌గా మారింది. లీడర్‌గా ఎదగాలనే కోరికతో 'వివాదాల' మార్గాన్ని ఎంచుకున్నారనే అపవాదు సైతం లేకపోలేదు. రాష్ట్రమంతా తన గురించే చర్చించుకోవాలనే తపన కూడా ఒక కారణం కావచ్చన్నది కొందరు గులాబీ శ్రేణుల భావన. శాసనసభలో వ్యవహరించాల్సిన తీరుపై ఇటీవలే ఓరియంటేషన్ క్లాసుల్లో ఆయన నేర్చుకున్నది ఇదేనా?.. పార్టీ సీనియర్లు నేర్పింది కూడా ఇదేనా?.. అంటూ అసెంబ్లీ లాబీల్లోనే చర్చ జరుగుతున్నది. పాపులారిటీ పెంచుకోడానికి, పార్టీ పెద్దల దృష్టిలో పడడానికి ఇలాంటి చీప్ ట్రిక్స్ ఎంచుకున్నారన్న మాటలూ వినిపిస్తున్నాయి.

అసెంబ్లీ ఎన్నికల సమయంలో హుజూరాబాద్ ఓటర్లను ఎమోషనల్ బ్లాక్ మెయిల్ చేసిన కౌశిక్‌రెడ్డి.. ఇప్పుడు ఒక అడుగు ముందుకేసి అసెంబ్లీలోనే సహచర ఎమ్మెల్యేను సైగలతో బెదిరించారన్న ఆరోపణలకు కేంద్ర బిందువయ్యారు. కేబినెట్ ఆమోదించిన ఎమ్మెల్సీల ఫైల్‌కు ఆమోదం తెలపకుండా పెండింగ్‌లో పెట్టారంటూ నాటి మహిళా గవర్నర్ తమిళిసైపై అసభ్యకర పదజాలంతో దూషించడం, మహిళా సంఘాల నుంచి తీవ్ర నిరసనలు రావడం, జాతీయ మహిళా కమిషన్ సీరియస్ కావడం, చివరకు ఢిల్లీ వెళ్లి క్షమాపణలు చెప్పడం.. ఇవన్నీ కౌశిక్‌రెడ్డి నోటిదురుసుతనానికి నిదర్శనం. అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపించకపోతే కుటుంబంతో కలిసి ఆత్మహత్య చేసుకుంటానంటూ వీడియో రిలీజ్ చేసి 'సూసైడ్ స్టార్'గా మారారు. ఇప్పటికీ ప్రత్యర్థుల నుంచి ఆ విమర్శలు ఎదుర్కొంటూనే ఉన్నారు.

ఆ మధ్య పోలీస్ అధికారిని బూతులు తిట్టడం, జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో హడావిడి చేయడం.. వీటికి కొనసాగింపుగా తాజాగా అసెంబ్లీలో సహచర ఎమ్మెల్యే కడియం శ్రీహరిపైకి తుపాకీ ఎక్కుపెట్టున్నట్లు చేతులతో సైగలు చేసి కొత్త వివాదానికి కారకులయ్యారు పాడి కౌశిక్‌రెడ్డి. ఆయన తీరును పార్టీ సమర్థిస్తున్నదా?.. అది వ్యక్తిగత వ్యవహారమంటూ బుకాయిస్తుందా?.. పార్టీకి నష్టం జరుగుతున్నదంటూ శ్రేణులు తలలు పట్టుకుంటున్నా పార్టీ పెద్దలు మాత్రం సైలెంట్. వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా వెనుకేసుకొస్తున్నారనే విమర్శలూ లేకపోలేదు.

ఓవైపు 'ఫ్యామిలీ సూసైడ్' బెదిరింపులు.. ఇంకోవైపు 'మర్డర్ సైగలు'.. అన్నట్లుగా తయారైంది పాడి కౌశిక్ రెడ్డి వ్యవహారం. సహచర ఎమ్మెల్యేను కాల్చేస్తానంటూ నిండు సభలోనే పాడి కౌశిక్ రెడ్డి అనడం క్షమించరానిదని, ఆయన సభ్యత్వాన్ని శాశ్వతంగా రద్దు చేయాలని బీఆర్ఎస్ మినహా మిగిలిన పార్టీల ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. చివరకు ఆయన సైగల బెదిరింపు వ్యవహారాన్ని ఎథిక్స్ కమిటీకి సిఫార్సు చేశారు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్. ఇది రానున్న రోజుల్లో ఎటువైపు దారితీస్తుందన్నది హాట్ టాపిక్‌గా మారింది. కౌశిక్ రెడ్డి తీరు, వివాదాలపై కలం ప్రత్యేక కథనం..

- తెలంగాణ బ్యూరో, కలం



## నాటి గవర్నర్ తమిళిసైపై..

### వివాదం:

"గవర్నర్ తమిళిసై ముచ్చట మాట్లాడుతా.. అసెంబ్లీ, కౌన్సిల్‌లో పాస్ చేసిన ఎమ్మెల్సీ నామినేట్ బిల్లును గవర్నర్ తన ** కింద పెట్టుకున్నది. ఇది రాజ్యాంగబద్ధ పాలనా? కేసీఆర్ ప్రభుత్వాన్ని ప్రజలు ఎనుకున్నరు. రాష్ట్రంలో ప్రజా ఆశీర్వాద ప్రభుత్వ పాలన కొనసాగుతున్నది. 119 మంది ఎమ్మెల్యేల్లో 105 మంది టీఆర్ఎస్ పార్టీకి (ఇప్పుడు బీఆర్ఎస్) సంబంధించిన ఎమ్మెల్యేలే. ఇంత మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కలిసి బిల్లును పాస్ చేశారు. ఆ బిల్లు రాజ్ భవన్‌లో గవర్నర్ తొక్కిపెట్టింది"అని పాడి కౌశిక్ రెడ్డి పేర్కొన్నారు.

### ఎప్పుడు.. ఎక్కడ.. :

2023 జనవరి 26. రిపబ్లిక్ డే వేడుకల సందర్భంగా జమ్మికుంటలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో వ్యాఖ్యలు.

### ఆ తర్వాతి పరిణామాలు:

- 2023 జనవరి 27న పాడి కౌశిక్ రెడ్డి కామెంట్లపై రాజ్‌భవన్ వర్గాలు ఆగ్రహం.
- బీజేపీ సరూర్‌నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి సరూర్‌నగర్ పీఎస్‌లో కౌశిక్ రెడ్డిపై ఫిర్యాదు.
- సుమోటోగా తీసుకున్న జాతీయ మహిళా కమిషన్. 2023 ఫిబ్రవరి 12న నోటీసులు జారీ. ఫిబ్రవరి 21న ఉదయం 11.30 గంటలకు విచారణకు హాజరుకావాలని ఆదేశాలు.

### వివరణ:

- "రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరఫున హుజూరాబాద్ నుంచి పోటీ చేసే అభ్యర్థిని నేనే. గవర్నర్ తమిళిసై ఢిల్లీ నుంచి వచ్చే ఆదేశాలకు అనుగుణంగా పని చేస్తున్నారు. ఇలా చేస్తే సహించేది లేదు. మహిళలు అంటే నాకెంతో గౌరవం. గవర్నర్ తీరు వల్లే ఇలా స్పందించాల్సి వస్తున్నది. అసెంబ్లీలో ఆమోదం పొందిన రాష్ట్ర అభివృద్ధి బిల్లులను ఆపడంతో కడుపు మండి మాత్రమే విమర్శలు చేశాను. ఇలాంటి పదాలు తెలంగాణలో సాధారణంగా వాడుతుంటారు. ఒక్క పదాన్ని కాకుండా.. నేను మాట్లాడిన మొత్తం విషయాన్ని అర్థం చేసుకోవాలి" అని మీడియాతో కౌశిక్ రెడ్డి పేర్కొన్నారు.
- 2023 ఫిబ్రవరి 21న మహిళా కమిషన్ ముందు విచారణకు హాజరైన పాడి కౌశిక్ రెడ్డి. 40 నిమిషాల పాటు విచారించిన కమిషన్ సభ్యులు. గవర్నర్ తమిళిసైపై చేసిన కామెంట్లపై లిఖితపూర్వకంగా, మౌఖికంగా వివరణ.
- తమిళిసైపై చేసిన వ్యాఖ్యలకు చింతిస్తూ కమిషన్ ముందు క్షమాపణ చెప్పిన పాడి కౌశిక్ రెడ్డి. మనస్ఫూర్తిగా క్షమించాలని కోరుతూ గవర్నర్‌కు లేఖ రాస్తానని కమిషన్ ఎదుట వివరణ. ఇంకోసారి గవర్నర్‌ను కించపరుస్తూ మాట్లాడనని హామీ.



# ఫ్యామిలీ సూసైడ్ బెదిరింపులు..



**ఎప్పుడు.. ఎక్కడ.. :**

**2023 నవంబర్ 30న పోలింగ్ జరగాల్సి ఉండగా.. ప్రచారానికి ఆఖరి రోజైన నవంబర్ 28న హుజూరాబాద్ రోడ్‌షోలో సంచలన కామెంట్.**

## వివాదం:

- ‘‘మీరంతా కలిసి నాకు ఓటేయకపోతే నేను, నా భార్య, నా బిడ్డ ఆత్మహత్య చేసుకుంటాం. నాకు ఓటేస్తే డిసెంబర్ 3న గెలిచి విజయ యాత్ర చేస్తా.. లేకపోతే డిసెంబర్ 4వ తారీఖున నా శవయాత్రకు మీరు రండి. ఎట్లైనా సరే.. మీ దయ.. మీ కడుపుల తలకాయపెట్టి కోరుతున్న.. ఒక్కసారి అవకాశం ఇవ్వండి. నన్ను, నా కుటుంబాన్ని మీరే కాపాడుకోండి. ఏం చేస్తరో.. ఇక మీ ఇష్టం’’అని కౌశిక్ రెడ్డి పేర్కొన్నారు.
- హుజూరాబాద్ నియోజకవర్గంలోని తన నివాసం నుంచి మరో వీడియో రిలీజ్. ‘‘హుజూరాబాద్ నియోజకవర్గ ప్రజలందరికీ నమస్కారాలు. 2018లో నేను పోటీ చేసి ఓడిపోయిన. తర్వాత ఎన్నో ఇబ్బందులకు గురైన. అయినప్పటికీ ఏనాడూ మిమ్మల్ని విడిచిపెట్టి పోలేదు. మీ కష్ట సుఖాల్లో పాలుపంచుకున్న. దయచేసి అందరూ కారు గుర్తుకు ఓటేసి నన్ను గెలిపించాలని చేతులు జోడించి కోరుతున్న. ఈ గుండె అలసిపోయింది.. ఈ గుండె బరువెక్కింది.. ఈ గుండెను మీరే కాపాడుకోవాలని చేతులు జోడించి కోరుతున్న. జై తెలంగాణ’’అని కౌశిక్ రెడ్డి పేర్కొన్నారు.

## ఆ తర్వాతి పరిణామాలు:

- ఒక బాధ్యతాయుతమైన పదవిలో ఉండి.. చట్టసభలకు వెళ్లాలనుకునే వ్యక్తి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించడంపై విపక్షాల మండిపాటు. సోషల్ మీడియాలో కౌశిక్ రెడ్డిని ‘సూసైడ్ స్టార్’అని కామెంట్లు.
- ఎన్నికల్లో ఓడిపోయిన హుజూరాబాద్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్. కౌశిక్ రెడ్డి కామెంట్లపై హైకోర్టును ఆశ్రయించిన ఈటల. ఓటర్లపై ప్రభావం చూపేలా ఉన్నాయని ఆరోపిస్తూ అనర్హత వేటు వేయాలని పిటిషన్.
- 2024 జూన్ 11న పాడి కౌశిక్ రెడ్డికి హైకోర్టు నోటీసులు. 20వ తేదీన వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలని ఆదేశాలు. అదేవిధంగా హుజూరాబాద్ నుంచి పోటీ చేసిన 24 మంది అభ్యర్థులకూ నోటీసులు. ఒక్కొక్కరి నుంచి వాంగ్మూలం సేకరణ.
- ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసిన అపోజిషన్ పార్టీ నేతలు.

# ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై షూటౌట్ సైగలు..

**ఎప్పుడు.. ఎక్కడ:**

**2026 మార్చి 29న అసెంబ్లీ వేదికగా..**



## వివాదం :

మైనింగ్ అక్రమాలు, భూ కబ్జాలపై ఎమ్మెల్యే కడియం శ్రీహరి లేచి బీఆర్ఎస్‌ను ఉద్దేశిస్తూ మాట్లాడుతుండగా.. కౌశిక్ రెడ్డి లేచి గట్టిగా అరుస్తూ.. ‘‘ఇంతకీ నువ్వు ఏ పార్టీలో ఉన్నవ్? నువ్వెట్లా పార్టీ మారినావ్! సిగ్గు లేనోడా!’’అంటూ వ్యాఖ్యలు. తర్వాత తన సీటులో కూర్చొని కడియం వైపు చూస్తూ.. తన చేతి వేళ్లతో తుపాకీ ఆకారాన్ని చూపిస్తూ.. కాల్చి పారేస్తానన్నట్లుగా సైగలు.

## ఆ తర్వాతి పరిణామాలు:

- కౌశిక్‌రెడ్డి ప్రవర్తనపై అసెంబ్లీలో తీర్మానం. మంత్రి శ్రీధర్ బాబు ప్రతిపాదించిన ఈ తీర్మానం ప్రకారం.. కౌశిక్ రెడ్డి వ్యవహారాన్ని సభా హక్కుల కమిటీకి రిఫర్ చేస్తూ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నిర్ణయం.
- కౌశిక్ రెడ్డి శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని సీఎం రేవంత్, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు డిమాండ్. గన్ సైగకు సంబంధించిన వీడియోను పరిశీలిస్తున్న ఎథిక్స్ కమిటీ.
- కడియం శ్రీహరి ఏ పార్టీలో ఉన్నారో అడిగానని, తన సైగలను తప్పుగా చిత్రీకరిస్తున్నారని కౌశిక్‌రెడ్డి సమర్థించుకునే ప్రయత్నం.
- సభను పదే పదే అడ్డుకుంటున్న బీఆర్ఎస్ సభ్యులపై రెండు రోజుల పాటు సస్పెన్షన్ వేటు వేసిన స్పీకర్.

## కేసీఆర్‌నూ అలానే బెదిరిస్తడా?



నిండు అసెంబ్లీలో కడియం శ్రీహరికి జరిగిన ఘటనే.. కేసీఆర్‌కు జరిగితే మీరు(బీఆర్ఎస్) ఆమోదిస్తారా? మా సైడ్ కూడా అంతకంటే కండలు తిరిగినోళ్లు ఉన్నారు. ఇక్కడ్నే.. తిరిగేసి.. బోర్లేసి కొట్టేవాళ్లు మా వద్ద కూడా ఉన్నారు. కానీ.. అసెంబ్లీలో కుస్తీలు, కొట్లాడేందుకు రాలేదు. విజ్ఞత ప్రదర్శించడానికి.. అవగాహనతో మాట్లాడేందుకే అందరం వచ్చాం. ఆకారం ఉంది కదా.. అని అవమానించడం కరెక్ట్ కాదు. ఏ అంశం గురించి అయినా ప్రస్తావించండి.. కానీ, ఇలాంటి పనులు చేస్తే ఊరుకునేది లేదు. పాడి కౌశిక్ రెడ్డి లాంటి వాళ్లను సభ క్షమిస్తే.. భవిష్యత్తులో ఈ సభలో కత్తిపోట్లు, కుస్తీ పోటీలే జరగాల్సిన పరిస్థితి వస్తుంది.దీన్ని ఇక్కడే నిలువరించాలి. సభా సంప్రదాయాలను ఉల్లంఘిస్తూ.. అసభ్యకర.. బెదిరింపు సైగలతో.. అవమానకరంగా వ్యవహరించిన పాడి కౌశిక్ రెడ్డి విషయంలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. ఆయనపై అసెంబ్లీ నియమ నిబంధనలకు మేరకు చర్యలు తీసుకోవాలి.

**- అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి**

## బీఆర్ఎస్‌లో పొజిషన్ కోసమేనా?

బీఆర్ ఎస్ పార్టీలో కేటీఆర్, హరీశ్ రావు తర్వాత పొజిషన్ తనదే అన్న సంకేతాలు ఇచ్చేందుకే పాడి కౌశిక్ రెడ్డి ఇలా వ్యవహరిస్తున్నారని ఆ పార్టీ శ్రేణుల్లో చర్చ జరుగుతున్నది. బీఆర్ఎస్ అధికారం కోల్పోయినప్పటి నుంచి కేటీఆర్, హరీశ్ రావు కన్నా ఎక్కువగా బీఆర్ఎస్ లో పాడి కౌశిక్ రెడ్డి స్పందిస్తున్నారు. తెలంగాణ భవన్‌లో ప్రెస్ మీట్లు పెట్టడం మొదలు.. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేటీఆర్ ను విచారణకు పిలిచినప్పుడు పోలీస్ స్టేషన్ ముందు తన అనుచరులతో కలిసి ఆందోళన చేయడం వరకు అన్నిట్లో ముందుంటున్నారు. అసెంబ్లీలోనూ ప్రతి విషయానికి స్పీకర్ పోడియం వద్దకు దూసుకెళ్తున్నారు. ఇలా దూకుడు వ్యవహారం ఓకే కానీ.. ఆ తీరే సరిగ్గా లేదని, ఇది పార్టీని పలుచనజేసేలా ఉంటున్నదని బీఆర్ఎస్ ఇతర నేతలు ఆందోళన చెందుతున్నారు.

## పార్టీ పెద్దల మౌనం వెనుక..!

పాడి కౌశిక్‌రెడ్డి వ్యవహార శైలిపై బీఆర్ఎస్ అధిష్టానం మౌనం పాటిస్తున్నది. అప్పుడప్పుడు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆయనను వెనకేసుకొస్తున్నారు. కావాలనే తమ ఎమ్మెల్యే కౌశిక్ ను ప్రభుత్వం కార్నర్ చేస్తున్నదని ఆయన ఆరోపిస్తున్నారు. అయితే.. పాడి తీరును బీఆర్ఎస్ ఇతర నేతలు కూడా సహించడం లేదు. చీటికిమాటికి అన్నింట్లో కలుగజేసుకోవడం, నోరుజారడం అలవాటైందని.. ఇప్పటికే అధికారం కోల్పోయిన పార్టీకి ఆయన తీరు మచ్చగా మారుతుందని అసెంబ్లీ లాబీల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కొందరు అనుకుంటున్నారు బీఆర్ఎస్‌ను విమర్శించేందుకు పాడి కౌశిక్ రెడ్డి తీరు అస్త్రంగా మారుతున్నదని అంటున్నారు. పార్టీ చీఫ్ కేసీఆర్ మౌనంగా ఉండటం.. కేటీఆర్ వెనకేసుకొని రావడం కరెక్ట్ కాదని అభిప్రాయపడుతున్నారు. ఇది ఇలానే కొనసాగితే జనంలో తిరగడం కష్టంగా మారుతుందని ఆందోళన చెందుతున్నారు. కావాలనే అధిష్టానం పాడి కౌశిక్ రెడ్డిని ప్రోత్సహిస్తున్నదా? లేక ఆయనే పార్టీని మరింత దిగజార్చేందుకు ఇలాంటి కాంట్రవర్సీలు క్రియేట్ చేస్తున్నారా అర్థం కావడం లేదని కొందరు బీఆర్ఎస్ నేతలు అసెంబ్లీ లాబీల్లో చర్చించుకుంటూ కనిపించారు.

# అరికెపూడి గాంధీపై..

**ఎప్పుడు, ఎక్కడ: 2024 సెప్టెంబర్ 12.. హైదరాబాద్‌లో**

## వివాదం:

రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో పబ్లిక్ అకౌంట్స్ కమిటీ( పీఏసీ) చైర్మన్‌గా శేరిలింగంపల్లి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీని నియమించింది. దీంతో 2024 సెప్టెంబర్12న తెలంగాణ భవన్‌లో హుజూరాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రెస్‌మీట్ పెట్టి కామెంట్లు చేశారు. “ఎమ్మెల్యేల ఫిరాయింపుపై హైకోర్టు తీర్పుతో గాంధీ బీఆర్ఎస్‌లోనే ఉన్నానని మాటలు మారుస్తున్నాడు. ఆయన నకిలీ గాంధీగా మారాడు. పార్టీ మారిన ఎమ్మెల్యేలకు చీరలు, గాజులు పంపుతున్నా. దమ్ముంటే తమ పదవులకు రాజీనామా చేయాలి. బీఆర్ఎస్‌లోనే ఉంటే తెలంగాణ భవన్ కు రావాలి. లేదంటే నేను ఎమ్మెల్యే గాంధీ ఇంటికి వెళ్తా. ఆయన మెడలో కండువా వేస్తా. ఇద్దరం కలిసి బీఆర్ఎస్ జెండా ఎగురవేద్దాం” అని పాడి కౌశిక్ చెప్పారు. అరికెపూడి గాంధీని ‘ఆంధ్రావాడు’ అని కౌశిక్ రెడ్డి అన్నారు. కౌశిక్ రెడ్డి కామెంట్స్ పై ఎమ్మెల్యే గాంధీ రియాక్ట్ అయ్యారు. “నా ఇంటిపై జెండా ఎగరవేయకపోతే.. నేనే.. మీ ఇంటికి వస్తా” అని ప్రతిసవాల్ చేశారు. ఈ పరిణామాలు హైదరాబాద్ లో తీవ్ర ఉద్రిక్తతలకు దారితీశాయి.



## పోలీసుకు వేలు చూపిస్తూ..

గాంధీ, అతని అనుచరులను అరెస్ట్ చేయాలని సైబరాబాద్ సీపీకి కంప్లయింట్ ఇచ్చేందుకు కౌశిక్ రెడ్డి, హరీశ్ రావు వెళ్లారు. అక్కడ పోలీసులతో కౌశిక్ రెడ్డి దురుసుగా ప్రవర్తించారు. వాగ్వాదానికి దిగారు. ఆ టైమ్ లో సీపీ అందుబాటులో లేరు. జాయింట్ సీపీకి ఫిర్యాదు చేశారు. సీపీ వచ్చి న్యాయం చేసే వరకు ఇక్కడి నుంచి కదలబోమని కమిషనరేట్ మెయిన్ గేట్ వద్ద కౌశిక్ రెడ్డి అండ్ టీమ్ బైఠాయించింది. పోలీస్ అధికారికి వేలు చూపిస్తూ కౌశిక్ రెడ్డి ఊగిపోయారు. ‘నీ పేరేంది. నాలుగేండ్ల తర్వాత మళ్లీ వస్తం.. అప్పుడు చూస్కుందాం’ అని హెచ్చరించారు.



# కరీంనగర్ సీపీపై..

**ఎప్పుడు, ఎక్కడ: 2026 జనవరి 29.. కరీంనగర్ జిల్లా వీణవంక**

## వివాదం:

కరీంనగర్ జిల్లా వీణవంకలో మినీ మేడారం జాతర సందర్భంగా పాడి కౌశిక్ రెడ్డి తన కుటుంబం, అనుచరులతో కలిసి వెళ్లారు. జాతర వద్ద భారీగా రద్దీ ఉందని, కాన్వాయ్‌కు అనుమతి లేదని పోలీసులు సూచించారు. ఎమ్మెల్యే, కుటుంబ సభ్యులను మాత్రమే అనుమతిస్తామని చెప్పారు. అనుచరులను తీసుకెళ్లొద్దనడంతో పోలీసులతో కౌశిక్ వాగ్వాదానికి దిగారు. తన కుటుంబంతో కలిసి పరకాల క్రాస్ రోడ్ వద్ద రోడ్డుపై బైఠాయించారు. దీంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలంపై కౌశిక్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారు.

## ఐపీఎస్‌ల సంఘం ఆగ్రహంతో క్షమాపణలు

సీపీ గౌస్ ఆలంపై పాడి కౌశిక్ రెడ్డి చేసిన కామెంట్లపై తెలంగాణ ఐపీఎస్ ఆఫీసర్ల అసోసియేషన్ తీవ్రంగా స్పందించింది. పోలీసులపై కౌశిక్ వ్యాఖ్యలు అసభ్యంగా ఉన్నాయని, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. చివరికి కౌశిక్ రెడ్డి పబ్లిక్‌గా క్షమాపణలు చెప్పారు. పోలీసులు తనను సొంతూరికి వెళ్లకుండా అడ్డుకుని, అసభ్యంగా ప్రవర్తించారని దీనిపై అసెంబ్లీ స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తానని ఆయన తెలిపారు.

# కేసు పెట్టబోయి.. పోలీస్ విధులకు అడ్డుతగిలి

**ఎప్పుడు, ఎక్కడ :**

**2024 డిసెంబర్ 4.. బంజారాహిల్స్ పీఎస్**

## వివాదం:

ఫోన్ ట్యాపింగ్ కేసు నేపథ్యంలో కౌశిక్ రెడ్డి 2024, డిసెంబర్ 4న బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేయడానికి వెళ్లారు. “ నా ఫోన్ కాల్స్‌ను అక్రమంగా ట్యాప్ చేస్తున్నారు. దీనికి సీఎం రేవంత్ రెడ్డి, ఇంటెలిజెన్స్ ఐజీ శివధర్ రెడ్డి బాధ్యులని అనుమానం ఉంది” అని కౌశిక్ రెడ్డి ఆరోపించారు. తన అనుచరులతో కలిసి స్టేషన్‌కు వెళ్లి పోలీసు వెహికల్ ను అడ్డుకుని ముందుకు వెళ్లకుండా మరో కారును అడ్డుపెట్టారు. పోలీసులను బెదిరించారని, విధులకు ఆటంకం కలిగించారని, పబ్లిక్ న్యూసెన్స్ చేశారని అదే నెల 5న కౌశిక్ రెడ్డి ఇంటికి పోలీసులు వెళ్లి ఆయనను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేశారు.

